# క్లాస్‌మేట్లు

గుండెబోయిన శ్రీనివాస్

'దినేషట! ఏవో సమీక్షా సమావేశాలట! మీరు తప్పకుండా హాజరు కావాలట!!'

ఇంట్లో అడుగు పెట్టగానే నా భార్య ఎదురుగా వచ్చి చెప్పింది.

దినేష్ పేరు వినగానే నాకు 'దడెల్లు'మంది. ఒక్కడేనా! వెంట ఎవరైనా వచ్చారా? అని అడుగుదామనుకొని ఆగిపోయాను. ఎందుకంటే చెప్పిన ఆ మూడు ముక్కల్లో కూడా 'ట' కారాల మీద ఆమె చూపించిన వెటకారం తాలూకు వెయిట్ ఎంతో అర్థం కావడం మూలాన, 'అలాగా' అన్నాను, పొడిగించకుండా, పొడిగిస్తే ఎటుపోయి ఎటు వస్తుందో! మా ఆవిడ అందరిలాంటిది కాదు. ఆవులించకుండానే పేగుల్ని లెక్క పెట్టడమే కాదు. అందులోని పదార్థాలు ఆమ్లాలో, క్షారాలో లిట్మస్ టెస్ట్ చేసినట్టు వివరంగా తెలుసుకోవడం ఆవిడకున్న ప్రత్యేకత. అందుకే ఆమె ముందు నోరెత్తితే నా బండారం బయటపడుతుందని గప్‌చుప్‌గా తిండి ముగించి ముసుగు తన్ని పడుకున్నాను.

కళ్లు ఎంత గట్టిగా మూసుకున్నా నాకు అస్సలు నిద్ర రావడంలేదు. పైగా నా భార్య చెప్పిన మాటలు పదే పదే గుర్తుకు రాసాగాయి.

దినేష్—సమీక్షా సమావేశాలు—నా హాజరు—

దినేషేమిటి? డైరెక్టుగా ఇంటికి రావడమేమిటి? వస్తూ వస్తూ మొగిలి, మురళిలను కూడా వెంటపెట్టుకొని వచ్చి ఉంటాడు. ఏదో ఒక బలహీనక్షణంలో మాట జారానే అనుకో! అయితే మాత్రం ఇలా ఇంటికి వచ్చి మనుషుల్ని ఇబ్బందుల్లో పడెయ్యడం మర్యాదేనా!? నాకు నేనే సమాధానపడలేక పోతున్నాను. నక్సలైట్ల కోసం గాలిస్తున్న, బి.ఎస్.ఎఫ్. బలగాల్లా వాళ్లు ముగ్గురూ నా కోసం ముమ్మరంగా గాలిస్తూనే ఉన్నారు. స్థావరాలు మారుస్తున్న నక్సలైట్లలా నేను వీళ్లను తప్పించుకుంటూనే వస్తున్నాను. నా 'అడ్డా'లన్నీ వెతకడం అయిపోయినట్టుంది. అందుకే 'డెన్ను' లాంటి ఇంటికి డైరెక్టుగా వచ్చేశాను.

ఇవ్వాల ఇంటికి వచ్చినవాళ్లు రేపు ఆఫీసుకు రారని రూలేమీ లేదు. మరైతే ఎట్లా! జీతం తీసుకోవడమే లేకపోతే నేను ఆఫీసు గురించి ఆలోచించేవాడినే కాదు. ఏదైనా మార్గం ఆలోచించాలి. ఇలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారి తయారై మెల్లగా ఆఫీసుకు వెళ్లాను. ఒకానొక గవర్నమెంట్ ఆఫీసులో నేనొక గుమాస్తాను. అప్పటికే మా ఆఫీసరు వచ్చేశాడు. లోకంలో ఉన్నట్లుగా మా బాస్‌కూ, నాకూ మధ్య ఎలాంటి గొడవలు లేవు. పైగా ఇద్దరి మధ్య మంచి అవగాహన ఉంది. ఆఫీసుకు రాకుండా ఆయన 'ఫ్రెంచి' లీవుల్లో చెక్కేస్తే, నేను 'జర్మన్' లీవుల్లో జమాయిస్తాను. నేను రెండు రోజులు ఆఫీసు తప్పిస్తే ఆయన వారం రోజులు ఎగ్గొడతాడు. ఆయన తప్పులు నాకు—నా తప్పులు ఆయనకు బాగా తెలుసు. కాబట్టి ఎవరి తప్పులు వాళ్లు కప్పిపుచ్చుకోవడానికైనా—ఎదుటివాళ్ల తప్పుల్ని కప్పిపుచ్చాల్సిన అవసరం ఉంటుంది. ఈ విషయం మా ఇద్దరికీ తెలుసు. అందుకే మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలు రావడానికి ఆస్కారమే లేదు. మెల్లగా గదిలోకి వెళ్లి మా బాసుకొక నమస్కారబాణం వదిలాను.

దానికి ఆయన "ఆః! చెప్పవోయ్ ఈశ్వర్!" ఏంటి? ఏం కావాలి చెప్పు! అన్నాడు.

'సార్! నేను ఆఫీసులో వున్న టైమ్‌లో నాకోసం ఎవరైనా వచ్చి వాకబు చేస్తే—నేను ఉన్నప్పటికీ, లేరని చెప్పండి అన్నాను.

అందుకాయన సరేనన్నాడు. అంటాడని నాకూ తెలుసు. కానీ నా భయం మా బాసు గురించి కాదు. నా కోసం కాపు కాస్తున్న మా కాలాంతకుల గురించి. అందుకే 'సార్ మీరీ విషయం మరచిపోవద్దు! ప్లీజ్!' అన్నాను.


నా ఆదుర్దాను గమనించినట్టున్నాడు. 'పొరపాటున నువ్వే వచ్చి నీ గురించి అడిగినా లేడనే చెబుతాను సరేనా?' అన్నాడు.

ఆ మాటకు ధైర్యంగా వెళ్లి కొట్లో కూర్చున్నాను. ఫైళ్లు ముందేసుకున్నట్లే గానీ, ధ్యాసంతా డబ్బు మీదే! చేతికి డబ్బులు వచ్చేదాకా సెకనులు నిమిషాలుగా—నిమిషాలు గంటల్లాగా గడిచాయి. ఇచ్చిన డబ్బు లెక్క పెడితే పదహారు వందలు. జీతం 'కోతలు' పోను నాకు వచ్చేది అంతే. దాదాపు అయిదు గంటలు కావస్తోంది. డబ్బును ప్యాంటు జేబులోకి దోపుకొని మా బాస్‌తో చెప్పి మెల్లగా ఆఫీసు నుండి బయట పడ్డాను. ఇంటికి వెళ్లే ఉద్దేశ్యంతో రోడ్డు మీదికి వచ్చి నిలబడ్డాను. అటూ ఇటూ చూస్తుండగానే ఒక ఆటో వచ్చి నా పక్కనే ఆగింది. ఎక్కుదామనుకొని ఒక అడుగు ముందుకు వేశాను.

మొగిలి, మురళి, దినేష్ ఒకరి వెనుక మరొకరు ఆటోలో నుండి గిదేరు. నాకు గుండెలో గుభేలుమన్నట్లయ్యింది. దాని తాలూకు ప్రకంపనలేవీ ముఖంలోకి వ్యాపించకుండా వాటిని బలవంతంగా అణచివేసి, చిన్నగా నవ్వి షేక్ హ్యాండ్ ఇవ్వబోయాను.

'హ్యాండివ్వడం నీకు కొత్త కాదు గదా—కానివ్వు' అంటూ చెయ్యి చాపాడు మురళి. అతని మాటల్లో నిష్ఠురం!

'అది కాదు' అంటూ సంజాయిఫీ ఇవ్వబోయాను.



కానీ నా ప్రయత్నాన్ని నిరోధించి, "అదంతా తరువాత కాని, ముందు ఆటో ఎక్కు" అన్నారు.

నేను మళ్లీ సర్దిచెప్పబోతుంటే నన్ను అమాంతం లేపి ఆటోలో కుదేశారు. ఒక్క క్షణమయితే అవతలపడేవాడిని. ఎంత పనైపోయిందనిపించింది. మరుక్షణంలో ఆటో స్టార్టు కావడం, వాళ్లు ఎక్కి అందులో కూర్చోవడం జరిగి

పోయాయి.

వాళ్లు ముగ్గురి మధ్యా నేను బిక్కు బిక్కుమంటూ సర్దుకొని కూర్చున్నాను. ఆటో ముందుకు వెళ్లుతున్నకొద్దీ నా ఆలోచనలు వెనుకకు పరుగు తీయసాగాయి. మేము నలుగురం పలకలు పట్టినప్పటి నుండి డిగ్రీ పట్టా పుచ్చుకునే దాకా కలిసే చదువుకున్నాం. దినేష్ రాజకీయాలలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. మొగిలి ఫైనాన్స్ కంపెనీ నడుపుతున్నాడు. మురళి మునిసిపల్ స్కూల్లో టీచరు. వీళ్లు ముగ్గురూ ఈ పట్టణంలోనే ఉంటున్నారు. నేనొక్కడినే గవర్నమెంటు ఉద్యోగం చేస్తూ దేశదేశాలు తిరిగి వాళ్లా వీళ్ల కాళ్లా వేళ్లా పడి, ఇటీవలే సొంత ఊరికి బదిలీ చేయించుకొన్నాను. ఉన్న ఊళ్లో నయినా గుమాస్తాగాళ్లకు, చిన్న ఇల్లు కట్టుకోవడమైనా గగనకుసుమమే కదా! మా ఆవిడ పొదుపు, చాకచక్యం మూలంగా సొంత ఊళ్లో సొంత ఇల్లు కట్టుకోవడం ఇన్నాళ్లకు సాధ్యమైంది. ఇక గృహప్రవేశమే తరువాయి. ఒక విధంగా నేను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నదే అందుకోసం నేను బదిలీ అయి వచ్చిన సందర్భంగా మావాళ్లు ఒక పార్టీ ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వాళ్లు ప్రతి ఆదివారం బారుతో కలుసుకునేవాళ్లట. దానికి ముద్దుపేరు సమీక్షాసమావేశాలట. నాకేమో తాగుడు అలవాటు లేదు. వాళ్లు పార్టీ ఏర్పాటు చేసిందే నా కోసం. ఇప్పుడెట్లా? ఆ మాటే వాళ్లతో అన్నాను.



కొద్దిసేపటి వరకు ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ తరువాత మొగిలి మెల్లగా 'చూడు ఈశ్వర్! తాగుడు తప్పని నీ అభిప్రాయం కావచ్చు. అది తప్పని మేమనడం లేదు. తాగితే చెడిపోతారని కూడా నీకనిపించవచ్చు. అది కూడా కరక్టే. గత పదేళ్లుగా మేం ప్రతి వారం తాగుతూనేవున్నాం. మేమంతా చెడిపోయినట్టేనా? ఒక వేళ చెడిపోతే నీ కన్నా ఎందులో తక్కువున్నామో చెప్పు' అన్నాడు.

నిజం చెప్పాలంటే వాళ్లతో నేను ఏ విషయంలోనూ సరితూగలేను. పదేళ్లుగా స్వంత పట్టణంలో ఉంటూ డబ్బుకు డబ్బూ, పలుకుబడికి పలుకుబడీ సంపాదించుకొన్నారు. గుమస్తాగిరీ నన్ను ఆ రెండింటికీ దూరం చేసింది. నేను డైలమాలో ఉండడం కనిపెట్టి, 'ఇంతటి సంతోషసమయంలో నువ్వు కంపెనీ ఇవ్వకపోతే ఇది ఫ్రెండ్షిప్పూ కాదు, మనం దోస్తులమూ కాదు' అన్నారు.

నేను లిమ్కా తాగుతానంటే మురళి పడనివ్వలేదు. మధ్యే మార్గంగా దినేష్ 'బీరు' తాగమంటూ సూచించేడు. సరే ఈ ఒక్క రోజే కదా అని బీరుకు ఒప్పుకున్నాను. మురళి ముఖం ముడుచుకున్నాడు. పార్టీ మొదలయ్యింది.

బార్ మధ్యలో ఖాళీ ప్రదేశం చిన్నటేబులు దాని చుట్టూ నాలుగు కుర్చీలు వేశారు. ముగ్గురూ తమ తమ పెగ్గుల్ని ఖాళీ చేశారు. నేను కూడా బీరు గ్లాసులోకి వంపుకొని చప్పరించాను. చల్లగా, వగరుగా, కొంచెం చేదుగా ఉంది.

'అచ్చం ఉగాది పచ్చడిలా లేదూ?' నా వైపు చూస్తూ అన్నాడు దినేష్.

ఎదుటి మనిషి అంతరంగాన్ని ఎలా కనిపెడతాడో నాక్కూడా అలాగే అనిపించింది. ఏమనాలో తెలియక ఊరికే నవ్వి ఊరుకున్నాను. రెండో కౌండు పూర్తయ్యాక సనుకుంటా—పెగ్గును సిప్ చేసి కిందపెడుతూ మురళి 'బీరు తాగేవాళ్లు భీరువులు' అన్నాడు.

మొదటి నుండి కూడా మురళికి నాకు పడదు. బదిలీ అయి వచ్చినప్పటి నుండి నన్ను ఏదో ఒక సందర్భం చూసుకొని బనాయిస్తూనే వున్నాడు. పదేళ్ల తరువాత కూడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దాన్ని ఇక్కడ కూడా కొనసాగిస్తున్నాడు. నాదసలే మాటపడే మనస్తత్వం కాదు. రెచ్చకొడితే పిచ్చి కోపం వస్తుంది. ఎదుటివాడికి బుద్ధి చెప్పందే ఆవేశం తగ్గదు. అయినా నిగ్రహించుకొన్నాను. నేను ఊరుకుంటున్న కొద్దీ మురళి ఎగతాళి చేయసాగాడు నా ఓపిక నశించసాగింది. ఇక ఆలోచించి లాభం లేదనుకొన్నాను. నేను తీసే ఎదురుదెబ్బకు మురళి గిర్రున తిరిగి కిందపడాలని నిర్ణయించుకున్నాను. రెప్పపాటులో టేబుల్ మీది విస్కీ బాటిల్ లాక్కుని గ్లాసులోకి వంపి, నీళ్లు కూడా కలుపకుండా నోట్లో పోసుకున్నాను.

మొగిలి నా చర్యకు తెల్లముఖం వేశాడు. దినేష్ దిగ్భ్రాంతి చెందాడు. నేను తీసిన దెబ్బకు మురళి గిర్రున తిరిగాడో లేదో కానీ, నాకు మాత్రం గొంతు భగ్గున మండింది. కళ్లు గిర్రున తిరిగాయి వాళ్ల కళ్లల్లోకి సూటిగా సూస్తే నా అవస్థను పసిగట్టేటట్టున్నారు. ఇంట ఓడినా రచ్చ గెలవాలి. అదీ మన థియరీ. అందుకే వాళ్ల వైపు చూడకుండా పైకి మొహం పెట్టాను.

'ఏంటి గురూ! పైకి చూస్తున్నవ్! ఏం కనిపిస్తున్నదేంటి?' అన్నాడు మురళి.

అతని మాటల్లోని వ్యంగ్యం నాకు అర్థమౌతూనే వుంది. ఏమనాలో తోచక 'చుక్కలు' అన్నాను. నిజంగానే నాకు చుక్కలు కనిపిస్తున్నాయ్యి.

'ఇంకొక్క పెగ్గు తీసుకున్నావంటే 'చుక్కలే'మిటి వాటి 'అక్కలు' కూడా కనిపిస్తాయ్!' ఎగతాళిగా మురళి.

వెనుకకు తగ్గడం నాకెప్పుడూ అలవాటు లేదు. పక్కనే వున్న దినేష్ పెగ్గును లాక్కొని ఒక్క గుక్కలో ఖతం చేశాను.

**(మిగతా వచ్చే వారం)**

## అద్దం



**ఓ** కళ్ల డాక్టరు దగ్గర పేషెంట్ పాపారావు పరీక్ష చేయించుకుంటున్నాడు. డాక్టరు రకరకాల అద్దాలు మారుస్తూ ఇప్పుడు బాగా కన్పిస్తుందా ఇప్పుడు బాగా కన్పిస్తుందా అని అడుగుతున్నాడు. ప్రతిసారి పాపారావు తల అడ్డంగా ఊపుతున్నాడు. డాక్టర్‌కి విసుగొచ్చి అద్దాలు లేని ఫ్రేము పెట్టాడు. ఇప్పుడు బ్రహ్మాండంగా కన్పిస్తుంది డాక్టర్ అని చెప్పాడు పాపారావు ఆనందంగా.